# తట్ట సంసారం

కౌకౌని కమల



**వెంకన్న నెత్తిన చెయ్యి పెట్టుకుని పొలం గట్టున కూర్చున్నాడు. మునిమాపు వేళ దాటింది.**

**చీకట్లు చిక్కబడుతున్నాయి.**

ఊరి చివర పొలాలు కావటంతో ఆ చీకటి మరింత చిక్కగా ఉంది.

అన్ని సక్రమంగా వుంటే చీకట్లు పడినా, ఊరి చివర అయిన రైతులు, పొలాలు సందడిగా వుంటాయి.

కానీ, ఈ ఏడాది వానల్లేక పొలాలన్నీ బీళ్ళు పడ్డాయి. వరినాట్లు నీలుక్కు పోయాయి.

వంగడాలు తలలు పక్కకి వాల్చేశాయి.

పచ్చగా నిటారుగా వుండాల్సిన ఆకు పండబారి తలలు వాల్చేశాయి.

వానల్లేవు. మోటబావులు ఎండి పొయ్యాయి. ఒక సంవత్సరం గాలి వాన, ఒక సంవత్సరం ముంపు, ఈ సంవత్సరం వానలు బొత్తిగా లేవు. వరసగా మూడు సంవత్సరాలు ప్రకృతి అరిష్టాలు. ఇంక ఎగసాయం ఎట్లా నడుస్తుంది. ప్రభుత్వం రైతుల కష్టాలు పట్టించుకోవడం లేదు. గత పదేళ్ళ నుంచి నదీజలాలు ఈ గ్రామాలకి పంపిస్తాం. సేద్యం సుఖతరం చేస్తాం. రిజర్వాయర్సు కట్టిస్తాం అంటూనే వుంది. అన్ని కాయితాల మీద అయితే ఖరారు అయ్యాయి. కాని ఇంతవరకు ప్రాజెక్టు పనులు మాత్రం ప్రారంభం కాలేదు: ఫండ్స్ లేవుట. ఆ నీళ్ళు ఎప్పుడో రావాలి. సేద్యగాళ్ళు ఎప్పుడు బాగుపడాలి?

వెంకన్నకి వున్నది అర ఎకరం పొలం. సకాలంలో వానలు పడితే, నీళ్ళు అందితే పంట బాగానే ఉండేది. జీవితం బాగానే గడిచేది. కాని మూడేళ్ళ నుంచి నీటి ఎద్దడి. పంట లేదు. వెంకన్నకి జీవనం కష్టం అయిపోయింది. షావుకారు దగ్గర చేసిన అప్పు

వడ్డీతో పాపంలా మూడేళ్ళనుంచి పెరుగు తోంది. ఆ అప్పు తీరే మార్గం లేదు.

తింటానికి గింజలు లేవు. చేద్దాం అంటే పని లేదు. నీళ్ళు లేక సేద్యం పన్లు ఎట్లా చెయ్యొస్తుంది. కాడెద్దులు చచ్చిపొయ్యాయి. మళ్ళీ కొనే శక్తి లేదు. పాడెబఱ్ఱెని అరకకి కదు తున్నాడు. ఇప్పుడు అది వట్టి పోయింది. పచ్చి మేత లేదు. బలమైన దాణా కొని తినిపించే శక్తి వెంకన్నకి లేదు. పిండగా పిండగా రెండు గిద్దల పాలు ఇస్తుంది. అది చంటాడి పొట్టకి సరిపోతుంది. బ్రతుకే భారం అయిపోయింది. మనాది పట్టుకొంది వెంకన్నకి.

ఏం చెయ్యాలో తోచక అలాగే పొలం గట్టున చీకట్లో మొండి చెట్టులా కూర్చున్నాడు.

ఏం చెయ్యాలి?

అప్పు ఎలా తీరాలి?

ఎలా బతకాలి?

ఇదే ఆలోచన...

ఓ... దూరంగా నక్కలు ఏడుస్తున్నాయి.

వెంకన్న ఆలోచన్లనించి తేరుకుంటూ చుట్టూ చూశాడు.

చీకట్లు చిక్కబడుతున్నాయి.

సరసరా గట్టున ఏదో పాకుతున్న అలికిడి.

బుస్స్స్..... మన్న శబ్దం.

వెంకన్న చరాలున లేచి చేతికఱ్ఱ తీసి అటు ఇటు ఆడిస్తూ రకరక నేలకి కొట్టాడు.

భుజం మీద తుండుగుడ్డ తీసి తలకి చుట్టుకొని గట్టమ్మట ఏడుస్తూ ఊళ్ళోకి వచ్చాడు.

గుడిసె ముందు లాంతరు వెలుగుతూంది. ఒక నిర్ణయానికి వచ్చినట్లు అలా వాడలో ఆఖరిగా వున్న తమ గుడిసె ముందుకి వచ్చాడు.

చంటి బిడ్డ గుక్క పెట్టి ఏడుస్తున్నాడు.

వెంకన్న పెండ్లాం గౌరమ్మ బిడ్డని గుడ్డ ఉయ్యాల్లో వేసి "ఝ్ఝా ఝ్ఝా ఝ్ఝా ఆయీ" అని పాడుతోంది. గుడిసెముందు వేసిన నులక మంచం మీద వెంకన్న నాలుగేళ్ళ కూతురు నిద్రపోతోంది.

వెంకన్న తిన్నగా వచ్చి అలుపుగా గుడిసె ముందు వాల్చిన నులక మంచంలో వెల్లకిలా వాలి కళ్ళు మూసుకున్నాడు.

బిడ్డ పడుకున్నాక గుడిసె బయటికి వచ్చిన గౌరమ్మ "నువ్వెప్పుడొచ్చినవ్?" అంది.

"ఇప్పుడే" అన్నాడు.

"కాలు సేతులు కడుగు" అంటూ లోపలికి వెళ్ళి పొయ్యి మీద పెట్టిన పెనం మీంచి వేడి వేడి జొన్నరొట్టెలు సత్తు పళ్ళెంలో వేసి చింత పండు తొక్కువేసి తెచ్చి మంచం దగ్గర పెట్టింది. ముంతలో నీళ్ళు తెచ్చి గడపవారగా వుంచింది.

"గౌరి ఈడ బతుకు గడిసేలా లేదు. ఊళ్లో చానామంది వేరే ప్రాంతాలకి వలసపోతు న్నారు."

"అవును, ఆడవాళ్ళకి సుట్టం పక్కం వున్న రంట. ఆళ్ళు ఏదో పన్లు చూపిస్తున్నరంట. అందుకే పోతున్నారు." అంది తన పళ్ళెం ఒళ్లో పెట్టుకొని పచ్చడి వేలితో తీసి నాకుతూ.


"మనం పట్నం పోదాం" అన్నాడు.

"పట్నంపోతే బాగానే వుంటుంది. పన్లు దొరుకుతాయి. కాని మనకి తెలుసున్న వాళ్ళు ఎవరున్నారు? పోయినా ఏడని వుంటం?"

"అయ్యన్ని ఆలోచించినా. ఆ మద్దిన రాయుడిగారి డాబా మీద గదులు వెయ్యటానికి పట్నం నుంచి కాంట్రాక్టర్ వచ్చాడు చూడు. ఆయన్ని అడిగాను పట్నం వస్తే బిల్డింగులు కట్టే కాడ మస్తు పన్లు ఉన్నాయి. కూలీలు దొరకటం లేదు. వస్తే పని ఇప్పిస్తనన్నడు. అడరసు కాగితం కూడా ఇచ్చినాడు. ఆయన ఆడ పన్నెండు అంతస్తుల బిల్డింగులు కడుతున్నా డంట. అక్కడ నీకూ నాకు కూడా పని ఇప్పిస్తా నన్నాడు. రోజుకి రెండు నూర్లకి తక్కువ కాకుండా సంపాదించచ్చు" అన్నాడు.

"అలాగా" అంది గౌరమ్మ. ముఖం చాటంత అయ్యింది. గౌరమ్మకి చిన్నప్పట్నించి పట్నం అంటే మోజు.

"అవును గౌరమ్మా. మన పట్నంపోతే బిల్డింగుల్లోన ఉండచ్చంట. కిరాయి ఉండదు. ఇద్దరం కల్సి సంపాయించచ్చు. కొంత తిని




## ఈ వీణకు శృతి

(నవల)


రచయిత్రి

డా॥ పెళ్ళకూరు

జయప్రద సోమిరెడ్డి


ప్రతులకు : వంశీ పబ్లికేషన్స్, 16/302, ఇందిరాభవన్ రోడ్, నెల్లూరు, మరియు విశాలాంధ్ర పబ్లికేషన్స్, నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్

వెల : రూ. 100/-




స్వాతి నవలల పోటీలో 1976 లో బహుమతి పొందిన నవల. ఈ నవలలోని యితివృత్తం, తండ్రి కోసం తన కిడ్నీ యిచ్చి బ్రతికించుకోవాలనుకుంటాడు విజయ్. అది యిష్టపడని శిల్ప అతనితో వివాహానికి సమ్మతించదు. కొడుకు పెళ్ళి చూడనిదే ఆపరేషన్‌కు యిష్టపడదు తండ్రి. తండ్రి, కొడుకు కాబోయే భార్య మీద ప్రేమ ఈ త్రికోణంలో తికమక పడుతున్న విజయ్‌ని, చిన్ననాటి స్నేహితురాలు, అన్నీ తెలిసిన విమల వివాహమాడుతుంది. విజయ్, శిల్ప, విమల తమ ప్రేమానుబంధాల పరిధులు గుర్తించి రాజీపడి జీవిస్తున్నా అనుకోని మలుపులు తిరిగి పోతుంది జీవితం. తండ్రికి యిన్‌ఫెక్షన్ వచ్చి ట్రీట్‌మెంటు, హాస్పిటల్ ఖర్చులు పెరిగి పోతాయి. నూతన దాంపత్యంలో సరదాలు, సరసాలు మరిచి, కష్టాలు భరించి జీవితాన్ని యథాతథంగా స్వీకరిస్తూ భర్తకి ధైర్యాన్ని భరోసాన్ని యిచ్చి విమల నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తుంటుంది. అదే సమయంలో తిరిగి మామగారికి ఆక్సిడెంటు అవటం మంచిరోజులు రావేమోనన్న దిగులు క్రుంగదీస్తుంది. తండ్రి కోసమే బ్రతుకుని పణంగా పెట్టిన భర్త విజయ్‌ని వెన్నంటే వుంటుంది. చివరికి తండ్రి తేరుకొని, "ప్రేమాభిమానం, ఆరాధన ఒక మోతాదులోనే ఉండాలి, మనసుల్ని కాల్చేది కాకూడదు" అన్న జీవన సత్యాన్ని కొడుకు విజయ్‌కి వివరిస్తాడు.

నవలలో పాత్రలన్నీ సజీవంగా, నిజాయితీగా కనపడతాయి. జీవన వీణలో అనేక శృతులను పలికించారు రచయిత్రి. తండ్రీ కొడుకుల ప్రేమానుబంధం, స్నేహితుల, ప్రేమికుల విశ్వాసానుబంధం, భార్యాభర్తల అనురాగబంధం, నమ్మకం యివి ఈ వీణకు శృతి. – వి. వాణిమోహన్



## జాకీకి నేనంటే అంత ప్రేమ మరి!

రవీనాటాండన్‌కి ఇటీవల ఓ షూటింగ్‌లో కొత్త అనుభవం ఎదురైంది. గర్భవతిగా వున్న ఆమె ఓ సన్నివేశంలో అద్భుతంగా నటించిందట. సీన్ బాగా వస్తే యూనిట్ క్లాప్స్ కొట్టడం సహజం.ఇదే జరిగిందక్కడ. అంతే! ప్రక్కనున్న జాకీష్రాఫ్ అర్జంటుగా దిష్టి తీసే సామాను తెప్పించి స్పాట్‌లోనే ఆమెకి దిష్టి తేసేశాడట. గర్భవతి కదా! దిష్టి తగుల్తుందని జాగ్రత్తలు తీసుకున్నానంటూ నవ్వుతూ దాటేశాడు జాకీ దీనిగురించడిగితే!

కొంత నిలవచేసుకోవచ్చు. ఇక్కడేం వుందని? వానలు లేవు. పంట బాగా పండినా ముందు అప్పులు కట్టాలి. అందుకే ఓ ఆలోచన చేసిన. వున్న అర ఎకరం అమ్మి అప్పులు తీర్చేద్దాం. మిగిలింది తీసుకుని పట్నం పోదాం."

గాభరా పడింది గౌరమ్మ. "పొలం అమ్మేస్తవా. పుట్టిన ఊరు. జాగా లేకుండా."

"ఏం చేస్తాం. అట్టా అనుకోబట్టే మన బతుకులు ఇంకా దిగజారినయ్. పుట్టిన ఊరే కాని పట్టెడు మెతుకులు దొరకట్లా. మనం సరే పిలగాళ్ళకన్నా ఇంత బువ్వ పెట్టాలి గదా".

ఆ రాత్రంతా ఇద్దరూ ఈ విషయమే చాలా సేపు తర్కించుకున్నారు. పట్నం వెళ్ళటానికే నిర్ణయించుకున్నారు.

❋ ❋ ❋

ఆ మర్నాడు వెంకన్న పెద్దకామందు దగ్గరకి వెళ్ళి విషయం చెప్పాడు.

"దొరా పొలం తీసుకొని తవరి బాకి చెల్లు బెట్టుకుని మిగిలింది ఇవ్వండి. పిల్లలు గలవాడ్ని. ఇంకా చిల్లర బాకీలున్నాయి" అన్నాడు.

ఆ మాటకి తాడెత్తున ఎగిరాడు కామందు.

"నీయవ్వ. ఏందిరా నువ్వు అనేది ఎంకిగా. కొండలా వడ్డీయే పెరిగిపోయింది. నీ పొలం దానికే చెల్లు. అసలు ఇంక అట్లనే వుంటుంది. పైగా నీకు నేను ఎదర ఇవ్వాలా" అని ఎగిరాడు. ఆఖరికి కాళ్ళా వేళ్ళా పడితే ఎలాగో ఒప్పుకున్నాడు. మొత్తం బాకీ పొలం కింద చెల్లు అయినట్టు చీటి ఇచ్చాడు. రెండు అరల గుడిసె షావుకారి అప్పు కింద ఇస్తాననంటే గౌరమ్మ వద్దంది. "వున్న ఊళ్ళో ఆ ఇంత నీడ లేకుండా చేసుకోవద్దు" అంది.

"మరి అప్పు ఎట్ట తీరాలె. షావుకారు వూరుకుంటాడా? పొలం కామందుకి ఇచ్చాం అంటే రంకె వేస్తాడు. అవ్వకావాలి, బువ్వ కావాలి అంటే నడవదే. ఊరు వదిలి పట్నం పోవాలంటే అప్పు కట్టాలి." అన్నాడు.

"సరే అయితే కానియ్యి. గుడిసె వుండని" అంది. కాళ్ళకి వున్న పది తులాల వెండి కడియాలు, చెవులకి వున్న బంగారు మరకతాలు, తీసి మగని చేతిలో పెట్టింది కన్నీళ్ళతో. వెంకన్న వాటిని షావుకారికి ఇచ్చాడు.

అప్పుపోను మిగిలింది వెంకన్న చేతిలో పెట్టాడు షావుకారు. ఆ దబ్బుతో పట్నం బయలు దేరారు. ఒక పెద్ద తట్టనిండా ధాన్యం, సత్తుగిన్నెలు, గళాసులు, పళ్ళాలు సర్దింది గౌరమ్మ. ఉన్న నాలుగు జతల బట్టలు బంతిలా దొంతు పెట్టి ఆ గిన్నెలు మీద సర్దింది. దుప్పట్లని ఆ బుట్ట మీద కప్పింది. ఖాళీ గుడిసెకి తాళం వేసి ఆ మర్నాడు తెల్లవారు ఝామున మొదటి బస్సు ఎక్కి పట్నం చేరారు.

పన్నెండు గంటల ప్రాంతంలో బస్సు దిగి నడుచుకొంటూ దగ్గర్లో వున్న పార్కులో తట్టతో సహా చేరారు. పిల్లలు ఆకలికి నకనకలాడుతున్నారు.

పార్కులోని బోరు పంపు కొట్టి కాళ్ళు చేతులు ముఖాలు శుభ్రం చేసుకున్నారు.

పార్కు దగ్గరవున్న బండి దగ్గరకు పోయి ఇడ్లీలు కొనుక్కుని వచ్చాడు. అంతా తిని నీళ్ళు తాగాక గౌరమ్మ పార్కులో పచ్చి గడ్డిలో బొంత పరిచి పిల్లల్ని పడుకోబెట్టి తను నడుం వాల్చింది.

"గౌరి తట్ట జాగ్రత్త. నేను పోయి కాంట్రాక్టరు అడ్డ ఏదో తెల్సుకుని వస్తాను. ఫోను నెంబర్లు ఇచ్చాడు" అన్నాడు వెంకన్న.

పార్కు గేటు దాటి ఎదరగా కనిపిస్తున్న పబ్లిక్ ఫోన్ డబ్బా దగ్గరకి వెళ్ళి అడ్రసు కాగితం తీసి నంబరు చూపించి కాస్త కలపమని ఆ ఫోనాయన్ని అడిగాడు. అది సెల్ నెంబరు కావటంతో కాంట్రాక్టర్ 'హలో' అన్నాడు.

"నేను సామి వెంకన్నని. ఎడ్లపాలెంనించి పట్నం వచ్చిన. తవరి అడ్డకి ఎట్ల రావాలో తెలియదు సామి పార్కు కాడ వున్నం" అన్నాడు.

"సరే, మా వాళ్ళు అట్నుంచి వచ్చేటోళ్ళు ఉన్నారు. మా పెద్ద మేస్త్రీ ఇల్లు ఆ పార్కు కాడే. మీరు పార్కు కాడ వుండండ్రి. మా వాళ్ళు వస్తారు మీ కాడికి" అన్నాడు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చిన పెద్ద మేస్త్రి సీతారామయ్య. తిరిగి కాంప్లెక్సుకి వెడుతూ పార్కు దగ్గరకి వచ్చాడు. వీళ్ళ తట్ట, బుట్ట చూస్తూనే "నువ్వేనా వెంకన్నవి. ఎడ్లపాలెం నుంచి వచ్చింది" అన్నాడు.

"అవునయ్యా" అన్నాడు వెంకన్న.

"సరే, ఇసుకలోడ్‌తో మా లారీ కాంప్లెక్సుకి వస్తుంది. మీరు దాంట్లో వద్దురు గాని" అన్నాడు. ఆయనకి టూ వీలర్ వుంది. పార్కు దగ్గర కాస్సేపు నిల్చున్నాడు. అంతలో ఇసుక లోడ్ చేసిన లారీ వచ్చింది. దాన్ని ఆపి వెంకన్న సంసారాన్ని అందులో ఎక్కించాడు. ఆయన దగ్గర సెల్లుంది.

దాదాపు పది ఎకరాల స్థలం. పన్నెండు అంతస్తులతో కాంప్లెక్సు నిర్మాణం జరుగుతోంది. వందలాది మంది కూలీవాళ్ళు పని చేస్తున్నారు. లారీల్లో ఇసుక, సిమెంటు, ఇటుక దిగుతున్నాయి. కూలీలు వాటిని దింపుకుంటున్నారు. మంచెలు కట్టి క్రేనుల్లో వాటిని పై అంతస్తులకి చేరేస్తున్నారు కూలీలు.

కాంప్లెక్సు కింద సెల్లార్‌లో చాలా మంది కూలీలు కాపురాలు పెట్టారు. చుట్టూ తడికలు, గోనె సంచులు, ప్లాస్టిక్ సీట్లతో గదుల్లాగ ఏర్పరచుకున్నారు. ఆడ, మగ, పిల్లలు చాలా మంది కూలిపన్లు చేస్తున్నారు..

గౌరికి ఆ సందడి నచ్చింది.

సగం మంది పైగా కూలీలు గ్రామాల నుంచి వచ్చినవారేనట. వ్యవసాయం పన్లులేక పట్నాలకి వలస వచ్చినవారేనట. సాయంత్రం ఆరు కాగానే చాలా మంది కూలీలు తట్టలు, పారలు అక్కడ పడేసి వెళ్ళిపోతున్నారు. పొరుగూరు నుంచి వచ్చిన కూలీలు మాత్రం అక్కడే కాపురాలున్నారు. వెంకన్న కూడా కాంప్లెక్సు సెల్లార్‌లో మూలకి వున్న జాగాలో తట్టదించి పెళ్ళాం పిల్లల్ని పెట్టాడు. బయట తడికలు, కట్టెలు, తాళ్ళు పడివున్నాయి. నాలుగు తడికలు, గెడకర్రలు తెచ్చి గదిలా ఏర్పాటు

చేసుకొని తాళ్ళతో బిగించాడు. అక్కడ పైన రూఫ్‌కి హుక్కు వుంది. గౌరమ్మ ఆ హుక్కుకి తాడుకట్టి గుడ్డ వుయ్యాలేసి బిడ్డని పడుక్కో పెట్టింది. ఇటుకలతో పొయ్యి పెట్టి చితుకులు ఏరి తెచ్చుకొని వంటలు చేసుకుంటున్నారు కూలీలు. గౌరమ్మ కూడా ఇసుక పోసి దాని మీద మూడు రాళ్ళు పెట్టి పొయ్యి రాజేసింది. గిన్నె పెట్టి అన్నం వండింది. ఇంటినుంచి వచ్చే టప్పుడు తెచ్చిన మిరపతొక్కు వేసింది. ఇద్దరు అన్నాలు తిన్నారు. చంటి బిడ్డకి పాలు తెచ్చాడు వెంకన్న. ఎడపిల్లకి అన్నం పెట్టి పడుకో పెట్టింది.

ఆ మర్నాటి నుంచి భార్యా భర్త ఇద్దరూ పనిలోకి దిగారు.

ఇసుక జల్లెడ పట్టటం గౌరమ్మ పని.

మంచెలమీంచి పై అంతస్తులకి ఇటుక చేరెయ్యడం వెంకన్న పని. వెంకన్నకి నూట యాభై, గౌరమ్మకి వంద రోజు కూలి. వారానికి ఒకసారి. ప్రతి శనివారం బట్వాడ. ఆదివారం శెలవు. చేసుకోవాలనుకొన్నవాళ్ళకి ఆదివారం కూడా పన్లు ఉంటాయి.

వారం తిరిగే సరికి దాదాపు రెండు వేలు చేతిలో పడేసరికి కళ్ళు గిర్రున తిరిగాయి గౌరమ్మకి వెంకన్నకి.

ఇద్దరూ ఇంకో కూలీతో కలిసి దగ్గరగా వున్న నగరం అంతా తిరిగి మొదటి ఆట సిని మాకి వెళ్ళారు. రోడ్డు ప్రక్కన అమ్మే దుకా ణంలో గౌరి చీర కొనుక్కొంది. జీవితం ఎంతో గొప్పగా అనిపించింది.

"ఉన్న ఊరు విడిచి పట్నం రావటానికి భయపడ్డాం గాని మావ ఆయిగుంది ఈడ. ఇంత డబ్బు ఎప్పుడన్నా చూశామా?" అంది గౌరమ్మ.

* * *

రెండు నెల్లు గడిచాయి.

డబ్బు వారం వారం చేతిలో పడుతూంది. ఖర్చులు పోను అంతో ఇంతో వెనకేస్తున్నారు. కాని అలవాటు లేని పని కావటంతో గౌర మ్మకి ఒళ్ళు పులిసిపోయింది.

ఒకరోజు ఇసుక పట్టడం. ఇంకొక రోజు పై కాంప్లెక్సుకి ఇసుక మొయ్యటం. అన్ని మెట్లు ఎక్కేసరికి చావు కళ్లబడింది. ఇంకొక రోజు కంకర దాబాకి పైకి చేర వెయ్యాల్సి వచ్చింది. ఎర్రని ఎండలో పని. తలపై బరువు పెట్టుకుని మెట్లు ఎక్కటం దిగటం. ఎక్కటం దిగటం! కాళ్ళు నడుం పీక్కుని పోతున్నాయి. మనిషి సగం తగ్గి ముఖంలో కళ తప్పింది.

"గౌరి నాలుగు దినాలు పని మానెయ్యి." అన్నాడు వెంకన్న నాలుగు దినాలు గౌరి ఇంట్లోనే వుండి పోయింది. ఆ రోజు లేచిన ముహూర్తం ఏంటో తెలియదు. కాని ఆ రోజు వెంకన్నని దురదృష్టం వెంటాడింది.

క్రేన్ నిండా ఇటుకలు పెట్టుకొని క్రేన్‌లో మూడో అంతస్తుకి చేరవేస్తున్నాడు. క్రేన్ హుక్ తెగి 'ధన్' మన్న శబ్దంతో కింద కూలి పోయింది. ట్రాలీ నిండా వున్న ఇటుకలన్నీ వెంకన్న మీద కుప్పగా పడ్డాయి. ఆ ఇటుకల కింద వెంకన్న దభీమంటు అంత ఎత్తునించి కింద పడ్డాడు. అతడు పట్నం బయలుదేరిన ముహూర్తం ఎలాంటిదో తెలియదు. వెంకన్నకి చావు దెబ్బే తగిలింది.

క్షణంలో గోల... అరుపులు... కేకలు.

ఎక్కడెక్కడి కూలీలు పన్లు వదిలి వెంకన్న చుట్టూ మూగారు.

గౌరమ్మ ఘోషకి అంతే లేదు.

వెంకన్న కుడికాలు పచ్చడి అయి పోయింది.

ఒళ్ళంతా రక్తం. గాయాలు...

తలపగిలి ధారలుగా రక్తం ముఖం తడిపేస్తోంది.

సెకండ్ ఫ్లోర్‌లో మొజాయిక్‌కి పాలిష్ పెట్టిస్తున్న కాంట్రాక్టరు పరుగున వచ్చాడు.

వెంకన్న చస్తే వాడి పీకల మీదికి వస్తుంది. వెంటనే ఆసుపత్రికి చేర్పించాడు.

నెల్లాళ్ళు ఆసుపత్రిలో వున్నాడు వెంకన్న.

కుడికాలు తీసేశారు. తప్పనిసరి అయింది. ఖర్చంతా కాంట్రాక్టరే పెట్టుకొన్నాడు.

గౌరమ్మ క్షోభ వర్ణించ శక్యం కాదు. రెక్కలు విరిగిన పక్షిలాగ విలవిల్లాడిపోయింది. పిల్లలు ఇద్దరూ చిన్నవాళ్ళు. నడవలేరు. వాళ్ళని తీసుకుని ఆసుపత్రికి ఇంటికి నడుచు కుంటూ తిరగటం. నగరంలో ఎవరూ బంధు వులు లేరు. సాటి కూలీలు తోచిన సాయం చేశారు. దాచుకున్న డబ్బంతా ఖర్చు అయి పోయింది. చంక కింద కర్రతో తలనిండా కట్లతో చావుతప్పి, కన్ను లొట్టయి ఇంటికి వచ్చాడు వెంకన్న.

భర్తని చూసి భోరుమంది గౌరమ్మ. "కాలు విరిగినందుకు యజమాని కాంట్రాక్టర్ నష్టపరిహారం ఇయ్యాలి. కాని ఆళ్ళు ఇయ్యరు. ఏడాది క్రితం కూడా ఒక కూలి చచ్చి పొయ్యాడు. రెండో అంతస్తు మీంచి కాలు తప్పి కింద పడ్డాడు. వెంటనే చచ్చిపొయ్యాడు. కానీ కాంట్రాక్టర్ ఏమీ ఇయ్యలేదు." అన్నాడు.

"ఇయ్యకుంటే ఎట్ల. ఆళ్ళ పని చేస్తుంటేనే కద ఇట్ల అయింది. కష్టం చేసుకుందుకు లేకుండా పోయింది" అంది గౌరమ్మ.


"కాని అడిగే మనిసేడి. కోర్టుకి పోవాలి. మనవల్ల అయితిందా?" అన్నాడు సాటికూలి. అయినా గౌరమ్మ కాంట్రాక్టరుని అడిగింది. నెల్లాళ్ళు ఆసుపత్రిలో పెట్టి వైద్యం చేయిం చాను. నాకు వేలు అయింది. నేను వైద్యం చేయించకపోతే వెంకన్న చచ్చిపోయేవాడు" అన్నాడు కాంట్రాక్టరు.

* * *

ఆ మర్నాటి నుంచి గౌరమ్మ మళ్ళీ పనిలోనికి దిగింది. పిల్లలిద్దర్ని వెంకన్న దగ్గర కూర్చోపెట్టేది. ఊళ్ళో అయితే ఏ చిన్న కష్టం వచ్చినా నల్గురూ కూడేవారు. చేతనయిన సాయం చేసేవారు. కాని ఇది పట్నం. ఎవడి గోడు వాడిది. ఎవరి బతుకు వాళ్ళది.

ఒకే చెట్టు మీద నివసించే పక్షులన్నీ ఎగిరిపోయి ఎక్కడెక్కడో తిరిగి రాత్రికి గూళ్ళు చేరుకొన్న చందం.

* * *



# అమెరికాపై 11 నంబరు



న్యూయార్క్ సిటీ (Newyork City) లో అక్షరాల సంఖ్య 11

ఆఫ్ఘనిస్తాన్(Afghanistan)లో కూడా అక్షరాలు 11

జార్జి బుష్ (George W.Bush) అధ్యక్షుని పేరులోని అక్షరాలు 11

న్యూయార్క్ స్టేట్ నంబరు (అమెరికా రాష్ట్రాలలో) 11

ట్విన్ టవర్స్‌ని ఢీకొన్న మొదటి ప్లేన్ నంబరు 11

ఆ ఫ్లయిట్‌లో 92 మంది ఉన్నారు (9+2) 11

రెండవ ఫ్లయిట్ 77 లో 65 మంది వున్నారు (6+5) 11

దుర్ఘటన 9/11 న జరిగింది (9+1+1) 11

సెప్టెంబర్ 11 వ రోజు సంవత్సరంలో 254 (2+5+4) 11 వ రోజు.

దీని భావమేమి తిరుమలేశా?

**- వి.కె. మోహన్**

గౌరమ్మకి ఇప్పుడు ఓపికలేకపోయినా నిత్యం కూలి పనికి వెళ్ళక తప్పటం లేదు. ఒళ్ళు పులిసిపోతుంది. రోజూ రాత్రి అయ్యే సరికి జ్వరం వచ్చినట్లు ఒళ్ళు సలసల్లాడు తూంది. అయినా తెల్లారి లేచి పనిలోకి వెళ్ళక పోతే గడవదు. మంచంలో పడ్డ వెంకన్న పరి స్థితి సరిగా లేదు. కాలు వేసిన చోట చేయి పడుతూంది. మళ్ళీ డాక్టరికి చూపించ లేదు. ఈసారి వెళితే డబ్బులు వెంకన్నే ఖర్చు పెట్టాలి. ఆటో ఎక్కి వెళ్ళాలి. డబ్బు ఏది? గ్రామంలో అయితే ఏ పసరు వైద్యం అయినా చేయించు కునేవాడు. కాని ఇది పట్నం. మరోనెల గడిచే సరికి వెంకన్న ఆరోగ్యం పూర్తిగా దిగజారింది. కుట్లు ఎర్రగా వాపు చేసి చీముపోసుకు వచ్చాయి. గౌరమ్మ ఆరోగ్యం కూడా దిగజారి ఎముకల గూడు అయిపోయింది. ఓపక్క భర్త పరిస్థితి భీతి గొలుపుతోంది.

ఆ రాత్రి గౌరమ్మ ఏడుస్తూ కూర్చుంది.

"ఇట్లా అశ్రద్ధ చేస్తే పానం మీదికి వచ్చుద్ది. చీము పట్టకూడదు. సెప్టిక్ అయితుంది. పోయి డాక్టర్‌కి చూపించుకోండి" అన్నాడు సాటికూలి.

"కాంట్రాక్టర్‌నే ఏదన్నా నష్టపరిహారం అడగండ్రి. కాలుపోయి ఎట్లా బతకాలి. కోర్టుకు పోతే న్యాయం జరుగుద్ది. కాని మనకి ఆ శక్తి లేదు కదా. అందుకని కాంట్రాక్టర్‌నే అడగండి" అన్నాడు ఆ కూలి.

"జర మీరు కూడా వెంబడి రండన్నా" అంది గౌరమ్మ.

"వస్తమమ్మ. మన అందరి బతుకులు ఒకటే. ఇయ్యాళ నీ కష్టం రేపు నాది అవదా? కాని ఆ కంట్రాక్టరు పైసా రాల్చడు. మన నోటి ఘోష. అయినా పోయి అడుగుదాం రాండ్రి" అన్నాడు గోవిందు సాటికూలి.

"అయ్యా మావూరు పోదాం అనుకుంటు న్నాం. ఆడు చావుబతుకుల్లో వున్నాడు. కాలంతా చీము పోసుకు వచ్చింది. తమరు మళ్ళీ డాక్టరు దగ్గరికి తీసుకుపోకపోతిరి" అంది.

"ఆ నెల్లాళ్ళకే నాకు వేలు అయ్యాయి. ఇంకా వెంకన్నని ఆసుపత్రికి తీసుకుపోతే నా చావు నేను చావాలి" అన్నాడు సురసుర లాడుతూ.

"అది కాదుసామీ. ఆడి పెళ్ళాం, పిల్లల ముఖం చూసి అయినా ఏదన్నా నష్టపరిహా రం..." అన్నాడు నసుగుతూ గోవిందు.

"ఈడ పనిలోకి వచ్చి ఆరునెల్లు కాలేదు. కాని నాకు వేలు ఖర్చు అయింది. చేసిన కూలీకి ఎప్పటికప్పుడు డబ్బిచ్చాను. లెక్కలు కడితే నాకు బోల్డంత నష్టం. వైద్యం చేయించి ప్రాణం కాపాడా. ఇంక చిల్లి గవ్వ ఇచ్చేది లేదు." అన్నాడు రంకెలేస్తూ.

"అళ్ళు ఊరికి పోతున్నారు. బస్సు చార్జీలవరకైనా..." అని ప్రాధేయపడితే రెండు వందలు ఇచ్చాడు.

"గ్రామం పోదాం. పసరు వైద్యం చేయించుకుందాములే. ఆ చీము పుండు మానిపోతయ్యి. మనది అనుకుందకు గుడిసె వుంది. ఏదో చేసి రెండు బర్రెలు పెంచుదాం. హోటలుకి పాలు పోద్దాం. దిగులు పడకు" అంది గౌరమ్మ భర్తని ఓదారుస్తూ.

ఆ రాత్రి వాళ్ళ చూరుకి తగిలించిన మేదరి తట్టతీసింది. శుభ్రంగా దులిపింది. వంట గిన్నెలు,అన్నం పళ్ళాలు, గ్లాసులు శుభ్రంగా ఇటుకపొడితో తోమి బోరింగ్ దగ్గర కడిగి శుభ్రంగా తుడిచి తట్టలో సర్దింది. బట్టలన్నీ మడతలు పెట్టి వాటి మీద పేర్చింది. దుప్పట్లు మడిచి తట్టపై కప్పి తాడుతో తట్ట బిగించి కట్టింది.

ఆ మర్నాడు ఉదయం బస్సు స్టాండుదాకా ఇద్దరు కూలీలు తోడు వచ్చారు. కర్రల సాయంతో కుంటుకుంటూ, ఒంటికాలితో యాష్టపడుతూ అడుగులు వేశాడు వెంకన్న. శుభ్రంగా రెండు కాళ్ళతో రోజంతా ఎద్దులతో సమంగా పనిచేసేవాడు. కాని ఇప్పుడు కుంటి బ్రతుకు అయిపోయింది. అడుగు తీసి అడుగు వేస్తున్నంత సేపు కళ్ళంట నీరు కారుతూనే వున్నాయి. సాటి కూలి మిత్రుడి సాయంతో ఎడ్ల పాళెం బస్సు ఎక్కాడు. కిటికీ దగ్గర కూర్చు న్నాడు. గౌరమ్మ పిల్లలు కూడా ఎక్కాక తట్టని బస్సు పైన వేశారు ఆ కూలీలు.

పట్నం వచ్చేముందు ఏదో బావుకుందాం అనుకున్నారు. కాని వున్న కాలుని కూడా పోగొట్టుకున్నాడు. ఆరోగ్యం నాశనం చేసుకుని పుట్టెడు దుఖముతో తిరిగి పల్లెకి ప్రయాణం అయ్యారు. రెండు బర్రెలు పెట్టుకుని హోటల్సుకి పోసుకుందాం అన్న అలోచన ఆనాడే చెయ్యకపోతిమి అని వాపొయ్యారు. మనిషిని నమ్మటం కంటె పశువుని నమ్మటం నయం అన్న నీతిని నేర్చుకుందుకే పట్నం వచ్చినట్టు అయింది ఆ పల్లె దంపతులకి.

పట్నం విడిచి బస్సు పల్లె దిశగా సాగుతోంది.

అయినవాళ్ళు సొంత ఊరు జ్ఞాపకం వచ్చి ఎంతో ధైర్యం వచ్చింది వెంకన్నకి, గౌరమ్మకి. ఏదో నిబ్బరం!

మనసు కుదుట పడినట్లు కళ్ళు మూతలు పడసాగాయి. చాలాకాలం తర్వాత నిద్ర ఆ ఇద్దర్నీ సేదదీర్చింది.

బస్సు గమ్యం వైపు పరుగులు తీస్తోంది. పైరగాలి చల్లగా హాయిగా వుంది. ❋